
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

శనివారం 18 జనవరి 2025

ఉచితం.. ఉపాధికి ఊతం

- సిద్దిపేటలో మహిళలకు శిక్షణ
- యూనియన్ బ్యాంక్, ఆర్‌సెటీ ఆధ్వర్యంలో ఏర్పాటు
- బ్యాచ్‌కు 30 మంది చొప్పున ఏడాదిలో 830 మందికి..

8

కలివేముల వెంకట లక్ష్మమ్మ జాతరలో జగ్గారెడ్డి

అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్




వెంకట లక్ష్మమ్మ, భూలక్ష్మమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న జగ్గారెడ్డి, జగ్గారెడ్డితో సెల్ఫీలు దిగుతున్న మహిళలు, అభిమానులు

సంగారెడ్డి రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కంది మండలం కలివేముల గ్రామ శివారులో వెలసిన శ్రీ వెంకట లక్ష్మమ్మ, భూ లక్ష్మమ్మ జాతర ఉత్సవాల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు మూడు రోజులుగా అంగరంగ వైభవంగా కొనసాగుతున్న వేడుకల్లో వందలాది మంది భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అత్యంత పురాతన మైన ఈ వనదేవత ఉత్సవాలకు జుల్‌కల్, ఎద్దుమైలారం, ఇంద్రకరణ్, కాశీపూర్, చెర్యాల, కంది, చిమ్నాపూర్, తోపుగొండ, చెర్లగూడెం తదితర గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఉత్సవాలకు జగ్గారెడ్డి హాజరుకావడంతో ఆయనతో సెల్ఫీలు దిగేందుకు భక్తులు, అభిమానులు ఎగబడ్డారు. జై జగ్గన్న, జైజై జగ్గన్న అంటూ నినాదాలతో హోరెత్తించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఇంద్రకరణ్ ఎస్‌ఐ విజయ్‌కుమార్‌గౌడ్ అధ్వర్యంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ పూజారులు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఎంతో చరిత్ర కలిగిన వనదేవతలు శ్రీ వెంకట లక్ష్మమ్మ, భూలక్ష్మమ్మ ఆలయాల అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని జగ్గారెడ్డి తెలిపారు. ఆయన వెంట సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జూలకంటి అంజనేయులు, మాజీ సర్పంచ్ నర్సింహులు, కాంగ్రెస్ నాయకులు రాజేందర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, మహేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పథకాల అమలుకే క్షేత్రస్థాయి పరిశీలన

- కలెక్టర్ మనుచౌదరి



రామునిపట్లలో సర్వే వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటరూరల్/చిన్నకోడూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి); ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రేషన్ కార్డుల జారీ వంటి సంక్షేమ పథకాల అమలుకు క్షేత్రస్థాయిలో పరిశీలన కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుందని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. శుక్రవారం నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది, చిన్నకోడూరు మండలం రామునిపట్లలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపై జరుగున్న ఫిల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియనుపరిశీలించారు. సిబ్బందికి ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ఫీల్డ్ వెరిఫికేషన్, డ్రాఫ్ట్ వివరాలను తయారు చేసుకునే ప్రక్రియ ఈ నెల 16 నుంచి 20 వరకు పూర్తి చేస్తామని తెలిపారు. 21 నుంచి 24వరకు జిల్లావ్యాప్తంగా గ్రామసభలు, మున్సిపాలిటీలో వార్డుసభలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత అందరి సమక్షంలో చర్చించిన తర్వాత పథకాలకు అసలైన లబ్ధిదారులు, వారి అర్హతలపై నివేదికను తయారు చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తామని చెప్పారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సదానందం, జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీరాములు, తహసీల్దార్ ఫైమద్ ఖాన్, ఏవో పరుశురాంరెడ్డి, ఎంపీవో శ్రీనివాస్‌రావు, చిన్నకోడూరు మండల ప్రత్యేక అధికారి జయదేవ్ ఆర్య, తహసీల్దార్ జయలక్ష్మీ, ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో సోమిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కవిత ఉన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద
పటిష్ట బందోబస్తు

- జిల్లాలో 12 'నవోదయ' ప్రవేశ పరీక్షా కేంద్రాలు

సిద్దిపేటకల్చరల్, జనవరి17(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ పరీక్ష కోసం జిల్లాలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ అనురాధ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు ఈ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. జిల్లావ్యాప్తంగా 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఉపాధిహామీ కూలీలకు
సకాలంలో చెల్లించాలి



రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీసీఈఓ రమేష్

జగదేవ్‌పూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీలకు సకాలంలో కూలీ చెల్లించాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని జడ్పీ సీఈవో రమేష్ హెచ్చరించారు. శుక్రవారం జగదేవ్‌పూర్ మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. 2022-24 వార్షిక పరిపాలన నివేదికలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అలా గే మండల పరిషత్ కార్యాలయానికి సం బంధించిన పలు రికార్డులను పరిశీలించా రు. అనంతరం జాతీయ, గ్రామీణ ఉపాధి హామీ కార్యాలయ సిబ్బందితో ఉపాధిహామీ పనుల అమలుపై సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామంలో నర్సరీల నిర్వహణ, జాబ్‌కార్డ్ కూలీలకు పనుల కల్పన వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి బి.యాదగిరి, ఎంపీవో ఖాజామొహినొద్దీన్, సూపరింటెండెంట్ ఆంజనేయులు, కార్యాలయ సిబ్బంది, ఏపీవో, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.


ఆశల ఊబి..!

అధిక వడ్డీ వస్తుందని యాప్‌లు, సంస్థల్లో పెట్టుబడులు

- బోర్డు తిప్పేయడం, యాప్ మూసేయడంతో లబోదిబో..
- మోసపోతున్న సాధారణ, మధ్యతరగతి యువకులు, ప్రజలు
- పోలీసు, టెలికాంశాఖ అవగాహన కల్పిస్తున్నా ప్రయోజనం శూన్యం
- జిల్లాలో ఇటీవలే వెలుగుచూసిన ఘటనలు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో.. అందరిలో గొప్పగా బతకాలని చాలా మంది ఆరాట పడుతున్నారు. అందులో కొందరు ఈజీ మనీ కోసం వెంపర్లాడుతుంటారు.. అదే ఇప్పుడు వారి కొంపలు ముంచుతుంది. చిన్నతనంలోనే కోట్లాది రూపాయలు సంపాదించాలన్న కాంక్ష మొదటికే మోసాన్ని తెస్తుంది. రోజురోజుకూ మోసం చేసేవారు పెరిగిపోతుంటే.. మోసపోయే వారి సంఖ్య అందుకు పదిరెట్లు ఎక్కువగా ఉంటుంది. వివిధ రకాల యాప్‌లు, ఆయా రకాల స్కీములు, క్రిప్టో కరెన్సీ, బిజినెస్‌ల పేరిట ప్రజలను, ముఖ్యంగా యువతను టార్గెట్ చేస్తూ సైబర్ నేరస్థులు అనేక నేరాలకు పాల్పడుతున్నారు.

- గజ్వేల్, జనవరి17 (ఆంధ్రజ్యోతి)



సిద్దిపేట జిల్లాలో నిత్యం ఏదో ఒకచోట సైబర్ నేరం, యాప్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోవడం, బిజినెస్‌లలో బోర్డులు తిప్పడం నిత్యకృత్యమయ్యాయి. ఈ విషయంపై ఇటు పోలీసుశాఖ, అటు టెలికాంశాఖ నిత్యం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా ప్రజలు మాత్రం మోసపోతూనే ఉన్నారు. అందులో ఎక్కువగా యువతే ఉండడం గమనార్హం.

ఇటీవల కాలంలో జిల్లాలో అనేక మోసాలు వెలుగుచూస్తున్నాయి. రియల్ వ్యాపారం పూర్తిగా నిలిచిపోవడం, రాజకీయంగా జిల్లాలో స్తబ్ధత ఏర్పడడంతో ఈజీ మనీ కోసం జిల్లాలోని యువత, ప్రజలు ఆకర్షితులవుతున్నారు. మొదట అధిక లాభాలను చూపుతుండడంతో వేల సంఖ్యలో ప్రజలు రూ.లక్షల్లో, కోట్లలో పెట్టుబడుతున్నారు. క్రిప్టో కరెన్సీ యూబిట్, యూనిబిట్, ఆయా కాయిన్స్ పేరిట పెట్టుబడులను స్వీకరిస్తున్నారు. మొదట చేరిన వారికి ఆకర్షణీయంగా లాభాలను అందిస్తుండడంతో వారి నుంచి తెలుసుకున్న అనేక మంది పెట్టుబడులను పెడుతున్నారు. ముఖ్యంగా జిల్లాలోని ములుగు, మర్కుక్, గజ్వేల్, చేర్యాల, సిద్దిపేట, జగదేవ్‌పూర్, వర్గల్ మండలాల్లో యువకులు ఇటీవల క్రిప్టోకరెన్సీలో భారీగా పెట్టుబడులు పెట్టారు. ఈ క్రమంలో అనేక కాయిన్స్ పేరిట పెట్టుబడులు గల్లంతయినట్లు తెలుస్తుంది. ఈ విషయం బయటకు పొక్కితే ఎక్కడ తాము పలుచన అవుతామోనని బయటకు చెప్పడం లేదు. ములుగు మండలానికి చెందిన ఇద్దరు యువజన నాయకులు సైతం ఈ తరహా పెట్టుబడుల్లో రూ.లక్షల్లో చేతులు కాల్చుకున్నట్లు తెలిసింది. వర్గల్ మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఈ తరహా పెట్టుబడితోనే లక్షలాది రూపాయలు కూడబెట్టారని, మర్కుక్ మండలానికి చెందిన ఓ యువకుడు రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టగా, ప్రస్తుతం సదరు పెట్టుబడుల పరిస్థితి ఏంటో అర్థం కాక తలపట్టుకున్నట్లు తెలుస్తుంది.

యాప్‌లలో పెట్టుబడులు

సిద్దిపేట జిల్లాలోని జగదేవ్‌పూర్, కుకునూరుపల్లి, చేర్యాల, కొమురవెల్లి, గజ్వేల్ మండలాల్లో ఆయా యాప్‌లలో పెట్టుబడులు పెట్టిన యువత యాప్‌లు మూసివేయడంతో ప్రస్తుతం లబోదిబోమంటున్నారు. కేవలం వారం రోజుల వ్యవధిలోనే దాదాపుగా రూ.10 కోట్లను యాప్ నిర్వాహకులు కొల్లగొట్టారు. ఆయా రకాల యాప్‌లు చేసే మోసాలు తెలిసినప్పటికీ యువత మాత్రం నిత్యం పెట్టుబడులను పెడుతూనే ఉన్నారు. ఇక ఇలా పెట్టుబడులు పెట్టిన యువకులు బయటకు విషయాన్ని చెప్పడానికి మదనపడుతున్నారు. చెబితే తమ ఇళ్లలో తమ పరిస్థితి ఏంటని, చుట్టుపక్కల వారు చులకనగా చూస్తారేమోనన్న విషయంపై మల్లగుల్లాలు పడుతున్నారు.

అధిక వడ్డీ ఆశ పెట్టి పలు మోసాలు

గజ్వేల్‌లో అధిక వడ్డీ ఆశతో బీ-4 స్పాన్ సంస్థ రూ.5కోట్ల వరకు నగదును కొల్లగొట్టినట్లు తెలుస్తుంది. గజ్వేల్‌లో రెస్టారెంట్, బీ-4 మెడికల్ షాప్, వర్గల్ మండలం గౌరారంలో యతి హౌజ్ పేరిట రెస్టారెంట్‌లను తెరిచి, పలువురి నుంచి లక్ష్మీకాంత్ అనే వ్యక్తి పెట్టుబడులను స్వీకరించారు. ఈ స్వీకరణలో గజ్వేల్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వ్యక్తులు దాదాపుగా రూ.5కోట్లు పెట్టుబడిగా పెట్టారు. అనంతరం లక్ష్మీకాంత్ ఒక్కసారిగా అదృశ్యమవడంతో తమ పరి

మిగతా 8వ పేజీలో...

యాప్‌ల ఉచ్చులో పడొద్దు

చేర్యాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చేర్యాల ప్రాంతంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలకు కోస్టాయాప్ నిర్వహకులు కుచ్చుటోపీ పెట్టిన విషయమై పోలీసులు శుక్రవారం మండలంలోని ఆకునూరు గ్రామాన్ని సందర్శించారు. అత్యధికంగా ఆకునూరు, కాశీగుడిశెలు గ్రామానికి చెందినవారే మోసపోవడంతో ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామస్థులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రైవేటు యాప్ నిర్వహకులు డబ్బులు ఊరికే ఎవరు ఇవ్వరని, సులభతర తీరులో డబ్బు పొందాలన్న ఆశకు లోనవకూడదన్నారు. కోస్టాయాప్‌లో డబ్బులు పెట్టి మోసపోయిన వారు 1930కి కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అపరిచత వ్యక్తులు పంపించే లింక్‌లు, మెసేజ్‌లు, యాప్‌లను నమ్మకూడదని తెలిపారు. ఆయనవెంట ఎస్‌ఐ నీరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



చేర్యాల మండలం ఆకునూరు గ్రామస్థులకు సూచనలిస్తున్న సీఐ శ్రీను

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

- బెట్టింగ్‌లకు అలవాటు పడకూడదు
- ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్

8



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

రైతులు మద్దతు ధరకు
విక్రయించాలి

- ఈనెల 26 నుంచి రైతుభరోసా
- అర్హులకు రేషన్‌కార్డులు అందిస్తాం
- త్వరలోనే జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటన
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్

సిద్దిపేట కలెక్టరేట్/కోహెడ జనవరి17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కందులు సాగుచేసిన రైతులందరూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలోనే మద్దతు ధర రూ.7,550 కు అమ్ముకోవాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. శుక్రవారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన కలెక్టర్ మనుచౌదరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో వడ్లు, పత్తి, సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేపట్టామని పేర్కొన్నారు. పంటలు పెట్టుబడి సాయం కోసం రైతుభరోసా రూ.12వేలకు పెంచి ఈనెల 26 నుంచి వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతు భరోసా అందజేస్తామని ఆయన తెలిపారు. త్వరలోనే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లాలో పర్యటించి ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తారని మంత్రి పేర్కొన్నారు. కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామని, అవసరం అనుకున్న వారు రేషన్ కార్డుల్లో పేర్ల మార్పిడి చేసుకోవచ్చని తెలిపారు. భూమిలేని ఉపాధి కూలీలకు రూ. 12 వేలు ఇస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవో సదానందం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, డీఏవో రాధిక, జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి క్రాంతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ వెంకటయ్య, ఏఎంసీ అకౌంటెంట్ సురేష్, పలువురు పాల్గొన్నారు.

'మండలంగా ఇందుర్తి' ప్రతిపాదనలున్నాయి..

కోహెడ మండలంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను శనివారం మంత్రి ప్రభాకర్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మండలంలోని తంగళ్లపల్లి, కోహెడ, తీగలకుంటపల్లిలో ఇటీవల మరణించిన లెంకల రాజయ్య, రంగు లక్ష్మీనారాయణగౌడ్, ఎర్రవెల్లి బాలకిష్టయ్య, బుర్ర ప్రశాంత్, కుక్కర్ల బాలయ్య చిత్రపటాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని పాత నియోజకవర్గమైన ఇందుర్తి గ్రామాన్ని మండలంగా మార్చుడానికి ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని చెప్పారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని నిర్మల జయరాజ్, పలువురు ఉన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- గ్రామ సభల్లో ప్రభుత్వాన్ని ఎండగట్టాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేట నియోజకవర్గ పార్టీ శ్రేణులతో టెలీకాన్ఫరెన్స్



సిద్దిపేట టౌన్, జనవరి17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పలు విషయాల్లో ప్రజలను మోసం చేస్తుందని, గ్రామసభల్లో ప్రభుత్వాన్ని ఎండగట్టాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం సిద్దిపేట నియోజకవర్గ పార్టీ శ్రేణులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హామిఇచ్చిన ఆరు గ్యారంటీలను అటకెక్కించిందన్నారు. ఆత్మీయభరోసా.. రైతు భరోసా, రేషన్‌కార్డు ఇందిరమ్మ ఇళ్ల విషయంలో మరోసారి మోసం చేస్తుందని చెప్పారు. గ్రామాల్లో వీటిపై గ్రామ సభలు నిర్వహిస్తున్నారని, గ్రామ సభల్లో పార్టీ శ్రేణులు పాల్గొని నిజమైన, అర్హులైన పేదలకు, రైతులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ఆత్మీయ భరోసా పథకాన్ని కోతలు విధించకుండా అమలు చేయాలని సభల్లో అడగాలన్నారు. జిల్లాలో 2 లక్షల మంది ఉపాధి హామీ కూలీలుంటే, ప్రభుత్వం తెచ్చిన నిబంధనలతో 75వేల మందికే వర్తిస్తుందని, మిగతా లక్షా 25 వేల మంది కూలీల సంగతి ఏమిటని ప్రశ్నించారు. గుంట భూమి ఉన్న రైతులను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించమని ప్రభుత్వం చెప్పడం దురదృష్టకరమన్నారు. ఎకరం లోపు భూమి ఉన్న రైతుకు కూడా ఈ పథకం వర్తించాలని గ్రామ సభలో అడగాలని సూచించారు. రైతు కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఇంటి స్థలం ఉండి కిరాయి ఉన్నవారికి, గుడిసెల్లో ఉండే వారికి, కవర్లు కప్పి ఉన్న ఇళ్లకు, అనాథలకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు, హిజ్రాలకు స్థలం ఉన్న వారిని గుర్తించి అర్హులైన వారికి అందేలా చూడాలన్నారు. రేషన్‌కార్డు విషయంలో ఇప్పటికే గ్రామాల్లో, పట్టణంలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు, కేసీఆర్ ప్రభుత్వంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి సంగతి ఏమిటని గ్రామ సభల్లో నిలదీయాలని హరీశ్‌రావు చెప్పారు.



గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న త్రిపుల్‌ఆర్ నిర్వాసితులు

మార్కెట్ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి

- లేదా.. భూమికి భూమి ఇవ్వాలి : త్రిపుల్‌ఆర్ భూనిర్వాసితులు
- గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా.. వినతిపత్రం అందజేత

గజ్వేల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదుట మర్కుక్ మండలం చేబర్తి, నర్సన్నపేట, వర్గల్ మండలం సామలపల్లి, రాయపోల్ మండలం బేగంపేట, ఎల్కల్, జగదేవ్‌పూర్ మండలం అలిరాజ్‌పేట, ఇటిక్యాల గ్రామాలకు చెందిన భూనిర్వాసితులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. గజ్వేల్ ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు బహిరంగ మార్కెట్ ప్రకారం నష్టపరిహారాన్ని అందజేయాలని లేదా భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొందరి స్వార్థం కోసం అలైన్‌మెంట్ మార్చారన్నారు. అయితే ప్రస్తుత అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో చంద్రకళ మాట్లాడుతూ తమ డిమాండ్లను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చినట్లు నిర్వాసితులు తెలిపారు. నిర్వాసితుల ఆందోళన నేపథ్యంలో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఆదేశాల మేరకు ఆర్డీవో కార్యాలయం వద్ద బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

పట్నంవారానికి వస్తున్నాం

- రేపే కొమురవెల్లి మల్లన్న మొదటివారం జాతర
- వేలాదిమంది హైదరాబాద్ భక్తుల రాక
- నేటి సాయంత్రమే ధూళిదర్శనం
- బ్రహ్మోత్సవాల్లో ప్రధానఘట్టం
- సోమవారం పెద్దపట్నం, అగ్నిగుండాలు

7లో

మాయమ్మా..కొండపోచమ్మ
కోటిదండాలు

- రేపటి నుంచి జాతర ప్రారంభం
- మూడు నెలల పాటు భక్తుల కోలాహలం
- ముడుపు కట్టి.. బోనమెత్తి మొక్కుల సమర్పణ



క్రైం కార్నర్

మోటార్‌సైకిల్‌పై నుంచి పడి..
చికిత్సపొందుతూ ఒకరి మృతి

చిలప్‌చెడ్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిలుపై వెళుతున్న వ్యక్తి అదుపు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతిచెందిన సంఘటన మండలం పరిధిలోని సోమక్కపేట గ్రామంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోగుల యాదగిరి(63) ఈ నెల 5వ తేదీన శిలంపల్లి గ్రామానికి పొలం పనుల నిమిత్తం వెళ్లి టీవీఎస్ ఎక్సెల్ బండిపై వస్తుండగా గ్రామ శివారులోకి రాగానే అదుపు తప్పి కిందపడ్డాడు. యాదగిరి తలకు గాయం కాగా, స్థానికులు ఆటోలో సంగారెడ్డిలోని ఎంఎన్ ఆర్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. యాదగిరి కుమారుడు పోగుల రాజశేకర్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి..

టేక్మాల్, జనవరి17(ఆంధ్రజ్యోతి) : చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని హసన్‌మహ్మద్‌పల్లి గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తెరగొర్ర అనిల్(25) గురువారం రాత్రి గ్రామ సమీపంలోని నాగులకుంటకు కాలకృత్యాలు నిమిత్తం వెళ్లాడు. రాత్రికి ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించ లేదు. శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో నాగులకుంట వద్ద వెతుకుతుండగా కట్టపై అనిల్ సెల్‌ఫోన్ కనిపించింది. అనుమానంతో గ్రామస్థులు కుంటలో వెతకడంతో అనిల్ మృతిదేహం లభించింది. అనిల్‌కు ఈత రాకపోవడంతోనే మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడి తల్లి దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తుక్కయ్య తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతిదేహాన్ని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భర్తతో గొడవ.. భార్య ఆత్మహత్య

గజ్వేల్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవకు దిగిన భార్య క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో చోటుచేసుకున్నది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మోనుపాల్‌కు బీహార్‌కు చెందిన పుతుల్‌కుమారి(19)తో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. మోనుపాల్ బతుకుదెరువు కోసం పుతుల్‌కుమారితో కలిసి ప్రజ్ఞాపూర్‌కు వలస వచ్చాడు. రెండు నెలల క్రితం ప్రజ్ఞాపూర్‌లో ఓ ఇంట్లో అద్దెకు చేరిన మోనుపాల్ స్థానికంగా ఉన్న ఓ ఐరన్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి పనికి వెళ్లిన మోనుపాల్ తిరిగి శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో పుతుల్‌కుమారికి వాట్సాప్‌లో మోనూపాల్ సిగరేట్ తాగుతున్నట్లు అతని స్నేహితుడు ఫొటో పంపించాడు. ఇదే విషయమై శుక్రవారం ఉదయం మోనుపాల్‌కు పుతుల్‌కుమారికి మధ వాగ్వాదం చోటుచేసుకున్నది. కొద్దిసేపటి తర్వాత మోనూపాల్ తాము అద్దెకు ఉండే ఇంటి భవనంపైకి పడుకునేందుకు వెళ్లి మధ్యాహ్నం 2 గంటల సమయంలో కిందికి వచ్చి చూసేసరికి పుతుల్‌కుమారి ఉరేసుకుని ఉంది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పుతుల్‌కుమారి మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంట్లో గొడవపడి యువకుడు..

కొల్చారం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో గొడవపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొల్చారం మండలం కిష్టాపూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎంబరి లక్ష్మణ్(23) హైదరాబాద్‌లో కారు డ్రైవింగ్ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్ని నెలల క్రితం తన చెల్లి పెళ్లి కోసం అప్పు కావడంతో లక్ష్మణ్ తల్లి మల్లమ్మ రెండు గుంటల వ్యవసాయ భూమి అమ్మి అప్పులు తీర్చాలనుకుంది. దీంతో కుమారుడు లక్ష్మణ్ తనకు కారు కావాలని గొడవ పడ్డాడు. గురువారం రాత్రి అందరూ పండుకున్న తరువాత ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అర్ధ రాత్రి తల్లి చూసేసరికి కొడుకు మృతిచెందడంతో గుండెలు బాదుకుంది. తండ్రి కొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో కూతురును, కొడుకును ఆమె పోషించేంది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ గౌస్ పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గుండెపోటుతో
ఈతవనంలో గీత కార్మికుడి మృతి

తొగుట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుకు గురై గీత కార్మికుడు మృతిచెందిన సంఘటన తొగుట మండలం ఎల్లారెడ్డిపేట గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బుర్ర వీరాస్వామిగౌడ్(56) కులవృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడికి భార్య కమలమ్మ, కొడుకు సురేష్, కూతుళ్లు శిరీష, హారీష ఉన్నారు. రోజు మాదిరిగా శుక్రవారం ఉదయం వీరాస్వామి కల్లు తీయడానికి ఈత వనం వద్దకు వెళ్లాడు. అక్కడ చెట్టు ఎక్కే క్రమంలో స్వామిగౌడ్‌కు గుండెపోటు రావడంతో కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు.

పట్నంవారానికి వస్తున్నాం

రేపే కొమురవెల్లి మల్లన్న మొదటివారం జాతర

- వేలాదిమంది హైదరాబాద్ భక్తుల రాక
- నేటి సాయంత్రమే ధూళిదర్శనం
- బ్రహ్మోత్సవాల్లో ప్రధానఘట్టం
- సోమవారం పెద్దపట్నం, అగ్నిగుండాలు

చేర్యాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి క్షేత్రం పట్నంవారానికి సిద్ధమైంది. మొదటి వారం జాతరతో మల్లన్న బ్రహ్మోత్సవాలలో ప్రధానఘట్టానికి తెరలేవనున్నది. నేటి సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన వేలాదిమంది భక్తులు ఇంటిల్లిపాది తరలిరానున్నారు. లక్షలాది మంది వచ్చే మహాజాతర ప్రారంభానికి ఆలయ వర్గాలు ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు.

పట్నంవారం అంటే...

సంక్రాంతి పర్వదినం తరువాత వచ్చే మొదటి ఆదివారాన్ని పట్నంవారంగా పిలుస్తారు. యాదవుల ఆడబిడ్డ అయిన మేడలాదేవీని మల్లన్న వివాహమాడిన నేపథ్యంలో యాదవులకు ఈవారం అత్యంత ప్రీతికరం. హైదరాబాద్‌కు చెందిన భక్తులు శనివారం ఇంటిల్లిపాదిగా కొమురవెల్లికి చేరుకుంటారు. కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోకుండానే స్వామివారిని నేరుగా ధూళి దర్శనం చేసుకుంటారు. ఆదివారం పుణ్యస్నానమాచరించి, భక్తిప్రపత్తులతో బోనం తయారుచేయడానికి స్థానికంగానే కూరగాయలు, మట్టికుండలు కొనుగోలు చేస్తారు. సంప్రదాయబద్ధంగా మల్లన్నకు బెల్లంపాయసంతో బోనం తయారుచేసి పట్నంవేసి సహంపక్తి భోజనం చేస్తారు. స్వామివారిని దర్శించుకుని ఒడిబియ్యాలు సమర్పిస్తారు. సోమవారం హైదరాబాద్ యాదవ పూజారుల సంఘం ఆధ్వర్యంలో పెద్దపట్నం వేసి అగ్నిగుండాలను దాటుతారు. వంటినిండా పసుపు ధరించి స్వామివారి ఆవాహనంతో అగ్నిగుండాలలో చిందేసి తన్మయత్వం చెందుతారు.


భక్తులు వచ్చే లైన్‌లో ఏర్పాటు చేస్తున్న ఫెన్సింగ్

పార్కింగ్ ఏర్పాట్లు

కొమురవెల్లికి చేరుకునే మూడు మార్గాల్లో మల్లన్న చెరువు సమీప ప్రాంగణం, పెట్రోల్‌పంప్ ఎల్లమ్మ ఆలయం, ఆర్టీసీ బస్టాండు సమీపాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. ఆలయాధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. బారీకేడ్లు, గ్యాలరీల ఏర్పాటు పనులును పరిశీలించారు.

లక్ష లడ్డూలు.. రూ.50 వేల వాటర్ బాటిళ్లు

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. త్వరితగతిన దర్శనమయ్యేలా సమన్వయంతో పనిచేస్తామన్నారు. రద్దీకి అనుగుణంగా లక్ష వరకు లడ్డూ ప్రసాదంతో పాటు పులిహోర తయారీకి చర్యలు తీసుకున్నామని తెలిపారు. క్యూలైన్లలో భక్తులకు తాగునీటిని అందించేందుకు రూ.50 వేల వాటర్ బాటిళ్ల సంసిద్ధం చేశామని, ఆలయ పరిసరాల్లో మిషన్ భగీరథ నల్లాలు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు తీసుకుంటామని చెప్పారు.



జోరుగా కటౌట్లు, ఫ్లెక్సీల ఏర్పాటు

పట్నంవారంతో పాటు జాతర సందర్భంగా ఆలయ రాజగోపుర ప్రాంగణం, పరిసరాలలో పలువురు ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారం భారీ కటౌట్లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గతానికి భిన్నంగా ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదేమాదిరి నెలకొల్పిన ఫ్లెక్సీలు, కటౌట్లను అప్పటి అధికారులు తొలగించగా, ప్రస్తుతం ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది చూడాలి.

అండవై నిలిచే మాయమ్మ కొండపోచమ్మకు కోటి దండాలు.. కోరమీసాల కొమురెల్లి మల్లయ్యకు ముక్కోటి దండాలు.. అంటూ భక్తుల శరణుఘోషతో తీగుల్ నర్సాపూర్ క్షేత్రం మార్మోగనున్నది. ఈ ఆదివారం నుంచి కొమురెల్లి భక్తులు ఆనవాయితీగా కొండపోచమ్మ ఆలయానికి దారి కట్టనున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించి వేడుకోనున్నారు. మూడు నెలల పాటు తల్లి సన్నిధి భక్తజన సందోహంగా మారనున్నది.


కొండపోచమ్మ ఆలయం

మాయమ్మా కొండపోచమ్మ.. కోటిదండాలు

రేపటి నుంచి జాతర ప్రారంభం

మూడు నెలల పాటు భక్తుల కోలాహలం

ముడుపు కట్టి.. బోనమెత్తి మొక్కుల సమర్పణ


కొండపోచమ్మతల్లి

జగదేవ్‌పూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తీగుల్ నర్సాపూర్ గ్రామంలోని కొండపోచమ్మ ఆలయం ముస్తాబైంది. మూడు నెలల పాటు కొనసాగనున్న జాతర ఆదివారంతో ప్రారంభమై ఉగాది వరకు హోరెత్తనున్నది. హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు ఉమ్మడి వరంగల్, నల్గొండ, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

రాజీవ్ రహదారి నుంచి 10 కి.మీ. దూరం

రాజీవ్ రహదారిపై కొడకండ్ల గ్రామం నుంచి కొండపోచమ్మతల్లి ఆలయం 10 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. పోచమ్మతల్లి కొమురవెల్లి మల్లన్నకు స్వయాన చెల్లెలని ప్రతీతి. మల్లన్న వరం ఇవ్వడంతో అమ్మవారు ఇక్కడ వెలిశారని నమ్మకం. కొమురవెల్లికి వచ్చిన భక్తులందరూ కొండపోచమ్మ ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఇక్కడి చెరువులో పుణ్యస్నానాలు ఆచరించి గుడి వద్ద ఉన్న చెట్టుకు ముడుపులు కడుతారు. బోనం సమర్పించి మొక్కులు చెల్లిస్తారు. కొండపోచమ్మ జాతరలో హైదరాబాద్, సికింద్రాబాద్ భక్తులు నిర్వహించే లష్కర్ బోనాల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

అన్ని ఏర్పాట్లు పూర్తి

భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కార్యనిర్వహణ అధికారి రవికుమార్ తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్, జనగామ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారన్నారు. ఆది, సోమ, మంగళవారాల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందన్నారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు చేపడుతున్నట్లు జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

మోదీని విడిచి కేజ్రీవాల్‌పై కాంగ్రెస్ విమర్శలు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య

సంగారెడ్డి రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో ఎన్నికలు ఉన్నందున కాంగ్రెస్ పార్టీ మోదీని విడిచి కేజ్రీవాల్‌ను విమర్శిస్తున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య ఎద్దేవా చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి జరిగితే రుజువు చేసి కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని, ప్రజల దృష్టికి మళ్లించేందుకు కాంగ్రెస్ డ్రామాలాడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో పాలన గాడితప్పిందన్నారు. సంగారెడ్డిలో నిర్వహించే రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర రాజకీయాలకు దిక్సూచిలా ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయరాజ్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్ ఐకేపీలో అవకతవకలపై విచారణ

ధూళిమిట్ట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఐకేపీ కేంద్రంలో అవకతవకలపై శుక్రవారం గ్రామ పంచాయతీ ఆవరణలో డీఆర్డీఏ విద్యాసాగర్ విచారణ చేపట్టారు. రూ.ఐదు లక్షల రూపాయలను తీర్మానాలు లేకుండానే చెక్కుల ద్వారా డ్రా చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈనెల 22న అన్ని రికార్డులను క్షుణంగా పరిశీలించాలని నిర్ణయించారు. అనధికారికంగా డబ్బు బదిలీ చేసినట్లు రుజువు అయితే చర్యలు తప్పవని డీఆర్డీఏ తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి మొత్తం వ్యవహారంపై విచారణ చేసి డబ్బును రికవరీ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దామరచెరువులో మహిళా గ్రూపు సభ్యుల ఆందోళన

రామాయంపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దామరచెరువు గ్రామ పరిధిలోని 30 మహిళా గ్రూపు సంఘాలకు చెందిన సభ్యులు కిస్తీల డబ్బు గోల్‌మాల్ జరిగిందంటూ శుక్రవారం ఆందోళన నిర్వహించారు. బ్యాంకు మిత్ర 14 గ్రూపుల నుంచి సేకరించిన డబ్బుల్లో కొంత బ్యాంకులో చెల్లించలేదని వారు మండిపడ్డారు. డబ్బే ఏదని అడిగితే వారం కిందట లక్షకుపైగా నగదును జమ చేసిందని, ఇంకా వాయిదా డబ్బు ఆమె వద్దే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ భీముడు అక్కడికి చేరుకుని మహిళల ఎదుటే విచారణ చేపట్టారు. వెంటనే రికవరీ చేస్తామని హామీ ఇచ్చారు. రెండు మూడు రోజుల్లో చెల్లించకపోతే మళ్లీ ఆందోళన చేస్తామని మహిళా గ్రూపు సభ్యులు హెచ్చరించారు.

'ఆటో డ్రైవర్ల బతుకులు ఆగం'

జోగిపేట, జనవరి17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయడంతో ఆటో డ్రైవర్ల బతుకులు ఆగమాగమయ్యాయని, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని భారత ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహాసంఘ్ (బీపీటీఎంఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి ఆవేదన చెందారు. శుక్రవారం జోగిపేటలో బీఎంఎస్ అనుబంధ తెలంగాణ ఆటో ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగులయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటోడ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత బస్సు పథకంతో ఆటోలో ప్రయాణికుల సంఖ్య పది శాతానికి పడిపోయిందన్నారు. అనేక మంది ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారన్నారు. ఆర్థిక బాధలు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే వారికి ప్రత్యామ్నాయ మార్గమన్నా చూపాలని డిమాండ్ చేశారు.




జోగిపేటలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రద్దీ, ధ్వంసమవుతున్న ప్లాట్‌ఫాం

కిక్కిరిసి.. సౌకర్యాలు మరిచి

అధ్వానంగా మారిన జోగిపేట బస్టాండ్


ప్లాట్‌ఫాంపై తొలగించని చెత్త


బస్సుల రాకపోకలకు అడ్డంగా నిలిపి ఉంచిన బైకులు

జోగిపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : అందోలు నియోజకవర్గ కేంద్రమైన జోగిపేటలోని ఆర్టీసీ బస్టాండ్ అధ్వానంగా మారింది. ప్రతీ రోజూ 150కిపైగా బస్సులు, 150 ప్రాంతాలకుపైగా రాకపోకలతో కిక్కిరిసి ఉండే ఈ బస్టాండ్ సౌకర్యాలకు నోచుకోవడం లేదు. అటు మెదక్, ఇటు సంగారెడ్డి జిల్లా కేంద్రాలకు మధ్యలో ఉండడంతోపాటు కామారెడ్డి జిల్లా, పొరుగునే ఉన్న మహారాష్ట్రలోని నాందేడ్, నర్సి, డెగ్లూర్ తతదితర పట్టణాల నుంచి వచ్చే ప్రయాణికులకు జోగిపేట బస్టాండ్ ట్రాన్సిట్ హబ్‌గా ఉంటోంది. అందోలు, నర్సాపూర్ నియోజకవర్గాలకు చెందిన సుమారు 70 గ్రామాలు, జోగిపేటకు చుట్టుపక్కలా ఉండగా, వారంతా నిత్యం వస్తువుల కొనుగోలు, పనుల కోసం జోగిపేటకు వచ్చివెళ్తుంటారు. విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు చెందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు విధి నిర్వహణ నిమిత్తం ఆర్టీసీ బస్సుల్లో జోగిపేటకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి రోజూ సుమారు 3వేల మందికిపైగా ప్రయాణిస్తారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో బస్టాండ్ కిక్కిరిసిపోతుంది. బస్టాండ్‌లో 20 ఏళ్ల క్రితం అప్పటి అవసరాల మేరకు నిర్మించిన నాలుగు ప్లాట్‌ఫామ్‌లే ఉన్నాయి. ఒక్కసారి నాలుగు కంటే ఎక్కువ బస్సులు వస్తే నిలపడానికి స్థలం ఉండడం లేదు. ప్రయాణికులు కూర్చునేందుకు సరిపడా కుర్చీలు లేవు. బస్టాండ్ వెనుక ప్రాంతం అంతా కూరగాయల మార్కెట్ విస్తరించి ఉండడంతో, అక్కడ మిగిలిన, కుళ్లిన కూరగాయలకు తోడు పరిసర ప్రాంతాల్లోని వ్యాపారులంతా తమ దుకాణాల్లోని చెత్తను బస్టాండ్‌లోని ఓ మూలలో వేస్తుండడంతో అధ్వానంగా తయారైంది. ప్లాట్‌ఫామ్‌కు ఆనుకుని మూత్రశాలలను నిర్మించడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. అసలే ఇరుకైన ప్రాంతంలో బస్టాండ్ కొనసాగుతోందంటే అదనంగా బైక్ స్టాండ్‌ను నిర్మించారు. వాహనాలను బస్టాండ్‌లోని ఖాళీ ప్రాంతంలోనే నిలుపుతుండడంతో బస్సులు వచ్చేందుకు, వెళ్లేందుకు ఇబ్బంది తప్పడం లేదు. నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బస్టాండ్‌ను పట్టించుకుని మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దర్గాలో 27 గంటల పాటు అఖండ భజన

జోగిపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అక్సాన్‌పల్లి గ్రామంలోని వట్‌పల్లి ఖ్వాజా దర్గాలో నిర్వహిస్తున్న 27 గంటల అఖండ భజన శుక్రవారంతో ముగిసింది. గురువారం ఉదయం మొదలైన ఈ అఖండ భజనను, వట్‌పల్లి ఖ్వాజా దర్గా అనువంశిక ధర్మకర్త హసన్‌దాస్ సజ్జాద్ (ముకుందరావు కులకర్ణి) ప్రారంభించారు. శుక్రవారం మధ్యాహ్నం అఖండ భజనను తిరిగి ఆయననే పరిసమాప్తి చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మత్త జగన్మోహన్‌రెడ్డి, అక్సాన్‌పల్లి సొసైటీ చైర్మన్ జీఆర్ నరేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రమేశ్, మాజీ ఏజీపీ హరినారాయణవర్మ, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, భక్తులు మొగులయ్యగౌడ్ చిస్తీ, కిష్టయ్యగౌడ్ చిస్తీ, అంజయ్య చిస్తీ, భక్తులు పాల్గొన్నారు.


భజన పరిసమాప్తిలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

క్రైం కార్నర్

తండ్రి చేతిలో కొడుకు హతం

మద్యానికి బానిసై వేధింపులు.. నిద్రిస్తుండగా పొడిచి చంపిన తండ్రి


మాదాసు శ్రీకాంత్(ఫైల్)

మనోహరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసగా మారి వేధిస్తుండడంతో కన్నతండ్రే కొడుకును హతమార్చాడు. ఈ ఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట్ గ్రామంలో చోటుచేసుకున్నది. సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట్ గ్రామానికి చెందిన మాదాసు ప్రమీల, దుర్గయ్య దంపతుకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉంది. కూతురు వివాహం జరిగింది. కుమారులిద్దరికీ ఇంకా వివాహాలు కాలేదు. పెద్దకుమారుడు నవీన్‌కుమార్ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తుండగా, చిన్నకుమారుడు శ్రీకాంత్ కారు డ్రైవింగ్ చేస్తుంటాడు. దుర్గయ్య దర్జీ పనిచేస్తుంటాడు. చిన్నకుమారుడు రోజూ మద్యం తాగివచ్చి తల్లిదండ్రులతో గొడవపడుతుండేవాడు. రోజులాగే గురువారం రాత్రి మద్యం తాగివచ్చి తల్లిదండ్రులను వేధించాడు. అనంతరం ఇంట్లోనే నిద్రపోయాడు. శ్రీకాంత్ తీరుతో విసిగిపోయిన తండ్రి దుర్గయ్య నిద్రిస్తున్న కుమారుడి కళ్లలో కారం చల్లి, కత్తితో మెడపై, తలపై పొడిచి హత్య చేశాడు. ఉదయం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్ కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కిరాణా దుకాణం దగ్ధం

- రూ.2 లక్షల నష్టం



పంచగామలో దగ్ధమైన కిరాణా దుకాణం, కాలిన నోట్లు

నారాయణఖేడ్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఖేడ్ మండల పరిధిలోని పంచగామలో శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్ షాట్‌సర్క్యూట్‌తో కిరాణా దుకాణం దగ్ధమై రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తెనుగు శంకర్ గ్రామంలోని తన ఇంటి వద్ద షెడ్డు ఏర్పాటు చేసుకుని కిరాణ దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున షెడ్ లోంచి మంటలు రావడాన్ని గుర్తించిన కుటుంబీకులు షటర్ తెరచి మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా ఆలోపే షెడ్డులోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. దీంతో రూ.50 వేల విలువ చేసే కిరాణ సామగ్రి, ఫ్రిజ్, రూ.లక్ష నగదుతోపాటు, డ్వాక్రా గ్రూప్ లీడర్ అయిన శంకర్ తల్లి బ్యాంకులో రుణవాయిదా చెల్లించడానికి సభ్యులు వద్ద వసూలు చేసి ఉంచిన రూ.50 వేల నగదు నోట్లు కాలిపోయాయి. మొత్తం రూ.2 లక్షల నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

మతిస్థిమితం లేని మైనర్‌కు గర్భం

హత్నూర, జనవరి 17: హత్నూర మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఓ మైనర్ (16) గర్భం దాల్చింది. ఆ బాలికకు మాటలు సరిగ్గా రాకపోవడంతో పాటు మతిస్థిమితం లేదు. ఇదే అదునుగా భావించి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఆమెపై లైంగిక దాడికి పాల్పడడంతో గర్భం దాల్చినట్లు తెలిసింది. ఈ విషయం బాలిక తల్లిదండ్రులు జిల్లా వైద్యాధికారులను ఆశ్రయించి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థుల ద్వారా తెలిసింది.

గ్రీన్ బడ్జెట్ నిధులు హాంఫట్

- సదాశివపేట బల్దియాలో హరితహారం సొమ్ము స్వాహా!

సదాశివపేట, జనవరి 17 : (ఆంధ్రజ్యోతి) : సదాశివపేట బల్దియాలో అభివృద్ధి పేరిట భారీగా నిధులు ఖర్చు చేయడం, బిల్లులు డ్రా చేయడం, లేని పనులకు రికార్డులు సృష్టించి ఖజానా ఖాళీ చేస్తున్న ఆరోపణలను 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాలతో వెలుగులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అయితే, అధికారులు, పాలకవర్గం చేసిన మరో నిర్వాహకం తెర మీదకు వచ్చింది. గ్రీన్ బడ్జెట్ నిధులను గల్లంతు చేశారు. హరితహారం పేరుతో నాటని మొక్కలకు భారీగా బిల్లులు డ్రా చేసుకుని నిధులు స్వాహా చేశారు. 2024 జూన్ 22వ తేదీన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్ల ఆమోదం కోసం 116 అంశాలతో రూపొందించిన ఎజెండాలో వేర్వేరుగా ప్రతిపాదనలు చేసి హరితహారం పేరుతో బిల్లులు పెట్టుకోవడం, ఆ బిల్లులకు పాలకవర్గం ఆమోదం తెలపడం పలు అనుమానాలకు తావిస్తున్నది. మొక్కల సంరక్షణ చేపట్టినట్లు రూ.65 లక్షల బిల్లులు పెట్టడం గమనార్హం. ఇంత ఖర్చు చేసినా పట్టణంలో పచ్చదనమేమి కంటికి కనిపించకపోవడం కొసమెరుపు. సమీకృత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఇంజనీర్ కార్యాలయం ఎదుట కొత్తగా నిర్మించిన మిషన్ భగీరథ ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ కింద మొక్కలకు సపోర్టింగ్‌గా పెట్టే కర్రలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. హరితహారం కార్యక్రమంలో పట్టణంలో వేలల్లో, లక్షల్లో మొక్కలే నాటితే.. వాటికి సపోర్టింగ్‌గా ఉంచాల్సిన కర్రలు ఎలా మిగిలిపోయాయనేది ప్రశ్నార్థకంగా మారింది. హరితహారం, గ్రీన్‌బడ్జెట్ నిధులు దుర్వినియోగం అవుతున్నట్టు కర్రలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. హరితహారం కార్యక్రమం అమలుపై సమగ్ర విచారణ జరపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


నిరుపయోగంగా పడిఉన్న వేల సంఖ్యల్లోని మొక్కల సపోర్టింగ్ కర్రలు

ఉచిత శిక్షణతో ఉపాధికి ఊతం

- సిద్దిపేటలో ఆదరణ పొందుతున్న ఉచిత శిక్షణా కేంద్రం
- యూనియన్ బ్యాంక్, ఆర్‌సేటీ ఆధ్వర్యంలో ఏర్పాటు
- బ్యాచ్‌కు 30 మంది చొప్పున ఏడాదిలో 830 మందికి శిక్షణ
- శిక్షణ అనంతరం బ్యాంకుల నుంచి రుణం పొందే అవకాశం
- వివిధ రంగాల్లో ఉచిత శిక్షణపై ఆసక్తి చూపుతున్న మహిళలు


శిక్షణ పొందుతున్న మహిళలు

సిద్దిపేట అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల నైపుణ్యాన్ని వెలికి తీసి స్వయం ఉపాధి ద్వారా వారి ఆర్థిక అభివృద్ధికి దోహదం చేయడానికి యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఆర్‌సేటీ ఆధ్వర్యంలో సిద్దిపేటలో ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శిక్షణ కేంద్రంలో మహిళలకు కుట్టుమిషన్‌లో ఎన్నో రకాల మెళకువలతో పాటు, బ్యూటీషన్ కోర్స్, మగ్గం వర్క్, జ్యూట్ వస్తువుల తయారీ, కంప్యూటర్ శిక్షణ కూడా అందిస్తున్నారు. మహిళతో పాటు పురుషులకు సీసీ కెమెరాలు, ఫోన్ రిపేరింగ్, ద్విచక్ర వాహనాల మరమ్మతులు, కంప్యూటర్ ఆపరేటర్, ఫొటోగ్రఫీపై శిక్షణ అందిస్తున్నారు.

సిద్దిపేటలో యూనియన్ బ్యాంక్, ఆర్‌సేటీ ఆధ్వర్యంలోని శిక్షణాకేంద్రం



ఆర్థికంగా ఎదగడానికి అవకాశం



మహిళలకు ఉచిత శిక్షణ కేంద్రంలో నాలుగైదు రకాల కోర్సులపై శిక్షణ అందిస్తున్నాం. మహిళలకు స్వయం ఉపాధితో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ అవకాశాన్ని శిక్షణ పొందివారు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలి.

- రాజలింగం, ఆర్‌సేటీ డైరెక్టర్

ఏడాదిలో 830 మందికి..

యూనియన్ బ్యాంక్, ఆర్‌సేటీ ఆధ్వర్యంలో గత సంవత్సర కాలంలో 830 మందికి వివిధ కోర్సులపై శిక్షణ అందించారు ప్రస్తుతం 30 మందితో టైలరింగ్ లో నూతన బ్యాచ్ కొనసాగుతుంది. కొన్నింటికి 15 రోజులు శిక్షణ ఉంటే మరికొన్నింటికీ 30రోజులు శిక్షణ ఉంటుంది. ఒక్కో బ్యాచ్‌లో 30 మందికి శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ సమయంలో భోజనంతో పాటు టిఫిన్ కూడా అందిస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ అందజేయడంతో పాటు రుణ సదుపాయం కూడా కల్పించనున్నారు.

టైలరింగ్ నేర్చుకుని షాప్ పెట్టుకుంటాం



టైలరింగ్ నేర్చుకుని ఉపాధి పొందుదామనే ఆలోచనతో ఈ శిక్షణ కేంద్రంలో చేరాను. ప్రస్తుతం టైలరింగ్‌లో అనేక మెలకువలను నేర్చుకుంటున్నాం. ఆ తర్వాత సొంతంగా షాప్ ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తా. ఈ కేంద్రంలో చాలా చక్కగా శిక్షణ ఇస్తున్నారు.

- చామంతి, సిద్దిపేట

ఆర్థిక ఎదుగుదలకు మేలు



స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగడానికి మాకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ శిక్షణలో అనేక మెళకువలు నేర్చుకుంటున్నాము లోన్ ద్వారా షాప్ పెట్టుకుని ఆర్థికంగా ఎదగడంతో పాటు నలుగురికి ఉపాధి కల్పించడానికి కూడా కృషి చేస్తాం. శిక్షణలో అన్ని రకాల మెళకువలను నేర్పిస్తున్నారు.

- మౌనిక, సిద్దిపేట

చక్కటి శిక్షణ అందిస్తున్నారు



గత 15 రోజుల నుంచి ఈ కేంద్రంలో శిక్షణ పొందుతున్నా. ఇక్కడ క్రమశిక్షణతో కూడిన శిక్షణను అందిస్తున్నారు. టైలరింగ్‌లో అనేక మెళకువలను నేర్పిస్తున్నారు శిక్షణ సమయంలో ఆహారాన్ని కూడా అందిస్తున్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగడానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుంది.

- ప్రవళిక, సిద్దిపేట

బాలసదనంను సందర్శించిన స్వాతిరెడ్డి


విద్యార్థులతో మాట్లాడుతున్న డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ స్వాతిరెడ్డి

సిద్దిపేట క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలసదనాన్ని శుక్రవారం డిస్టిక్ లీగల్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి సందర్శించారు. అక్కడి పిల్లలతో మాట్లాడి బాగోగులను తెలుసుకున్నారు. తరగతి గదులను, వంటగదిని, పరిసరాలను, మెడికల్ కిట్లను పరిశీలించారు. సిబ్బంది విధులకు సరిగా హాజరవుతున్నారా లేదా అని అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. పిల్లలకు చట్టాల గురించి చదువు విలువ, బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించారు. ఒక అమ్మాయి, ఒక అబ్బాయి ఎన్సాన్ పల్లి రోడ్డులో భిక్షాటన చేస్తుండగా ఆపరేషన్ స్మైల్ టీం పట్టుకొని బాలసదనంకు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ బాబా, బాలసదనం సూపరింటెండెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల బాలిక అదృశ్యం

గజ్వేల్, జనవరి 17, (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల బాలిక అదృశ్యమైన ఘటన గజ్వేల్ పట్టణంలో శుక్రవారం రాత్రి జరిగింది. పట్టణంలోని ఐవోసీ మైదానంలో గుడిసె వేసుకుంటున్న ఓ కుటుంబంలోని మూడేళ్ల బాలిక కనిపించకపోవడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సైదా ఆధ్వర్యంలో పోలీసులు బాలిక ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడొద్దు

- ఏఆర్ అడిషనల్ డీసీపీలు


మాట్లాడుతున్న ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్

సిద్దిపేట క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్. ఏఆర్ కానిస్టేబుళ్లకు, హోంగార్డులకు సూచించారు. శుక్రవారం వారు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్‌తో కలిసి పెద్ద కోడూరు గ్రామ శివారులో ఉన్న సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో ఏఆర్ అధికారులు సిబ్బంది, హోంగార్డ్లకు సోషల్ మీడియా, ఆన్లైన్ బెట్టింగ్, ఆన్లైన్ గేమ్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి కుటుంబాలను రోడ్డున పడవేయొద్దని సూచించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తే డిపార్ట్‌మెంట్‌లో తప్పక గుర్తింపు ఉంటుందని తెలిపారు. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈజీ మనీకి అలవాటు పడవద్దని సూచించారు. చాలామంది యువకులు ఆన్లైన్ బెట్టింగ్ గేమ్స్‌కు అలవాటుపడి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పూర్ణచందర్, ధరణి కుమార్, రాజేష్, కార్తీక్, ఆర్ఎస్ఐలు ఏఆర్ సిబ్బంది, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

ఆశల ఊబి..!

(5వ పేజీ తరువాయి)

స్థితిపై పెట్టుబడిదారులు ఆందోళన చెందుతున్నారు.

పేద, మధ్యతరగతి వారే అధికం

ఈ ఆన్‌లైన్‌లో పెట్టుబడులు, క్రిప్టోకరెన్సీలో పెట్టుబడులు పెడుతున్న వారిలో అత్యధికులు పేద, మధ్య తరగతికి చెందిన వారే ఉంటున్నారు. రియల్ వ్యాపారం జోరుగా సాగిన సమయంలో వ్యాపారంతో అనేక జల్సాలు చేసిన యువకులు ప్రస్తుతం అప్పులు తీసుకువచ్చి పెట్టుబడులు పెట్టి మరీ చేతులు కాల్చుకుంటుండగా, పలు పరిశ్రమలకు చెందిన కార్మికులు సైతం తమకు వచ్చే వేతనంలోని కొంత భాగాన్ని యాప్‌లలో పెట్టుబడిగా పెడుతున్నారు. యాప్‌లను క్లోజ్ చేయడంతో తమ కష్టం వృథా అవుతుంది. చేసే పనితో పాటు సైడ్ ఇన్‌కంగా ఉంటుందని భావిస్తున్న పలువురికి మొదటికే మోసానికి వస్తుంది. ఓ గ్రామంలో యువకుడు తనకు తెలిసిన వారి నుంచి అప్పులు తీసుకువచ్చి యాప్‌లో పెట్టుబడి పెట్టగా, యాప్ క్లోజ్ చేసిన అనంతరం ఆయన తండ్రి తమకు ఉన్న భూమిని అమ్మి అప్పులను చెల్లించారు.

ప్రయోజనం శూన్యం

సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ నేతృత్వంలో నిత్యం పోలీస్ అధికారులు, సిబ్బంది ఏదో ఓ చోట కళా ప్రదర్శనలు, అవగాహన సమావేశాలు, కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈజీ మనీకి ఆశపడి, అధిక లాభాలకు ఆశపడి పెట్టుబడులు పెట్టవద్దని, డిజిటల్ అరెస్ట్ అంటూ ఏమీ ఉండదని చెబుతున్నప్పటికీ ప్రజలు మాత్రం పెట్టుబడులు పెడుతూనే ఉన్నారు. ఇక టెలికాం శాఖ ఇటీవల ఆయా నెట్‌వర్క్ ప్రొవైడర్ల ద్వారా సైబర్ క్రైమ్స్‌కు సంబంధించిన కాలర్ ట్యూన్‌ను వినిపిస్తుంది. ఎవరికి ఫోన్ చేసినా మొదట డీఓటీ ప్రవేశపెట్టిన కాలర్‌ట్యూన్‌ను ప్రతి రోజు పది సార్ల చొప్పున వచ్చే మూడు నెలల పాటు వినిపించాలని డీఓటీ(డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్స్) నిర్ణయం తీసుకుంది. అయినప్పటికీ పెద్దగా ప్రజల్లో మార్పు రావడం లేదు. సైబర్ నేరాలు, అధిక వడ్డీ, అధిక లాభాల ఆశకు బలవుతూనే ఉన్నారు.

అప్రమత్తతే ప్రధాన అస్త్రం..

సైబర్ క్రైమ్స్, అధిక వడ్డీలు, అధిక లాభాలు, క్రిప్టోకరెన్సీ ద్వారా లాభాలకు ఆశ పడకుండా అప్రమత్తంగా ఉండడమే ప్రధాన అస్త్రం. ప్రజలు ఈజీ మనీ కోసం ఆశపడుతుంటే సైబర్ నేరస్తులు యథేచ్ఛగా రెచ్చిపోతూ కొట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తమై ఈజీ మనీ కోసం ఆశ, ఆరాట పడకుండా జాగ్రత్తలు తీసుకుంటేనే మేలని సైబర్‌క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. ఈ విషయంపై తల్లిదండ్రులు సైతం యువకులకు తెలియపరచాలని వారు సూచిస్తున్నారు. ఈ విషయంపై అవగాహన పెంచుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని, పాఠశాల, కళాశాల స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెబుతున్నారు.

జిల్లాలో ముమ్మరంగా 'పథకాల' సర్వే


నంగునూరు: సిద్దన్నపేటలోని ఓ వెంచర్ వివరాలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

చేర్యాల/ దూళిమిట్ట/ నంగునూరు/ సిద్దిపేట అర్బన్/జగదేవ్‌పూర్/మిరుదొడ్డి/కొండపాక/ములుగు/రాయపోల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లావ్యాప్తంగా సాగు యోగ్యంకాని భూములు, రేషన్‌కార్డులు, రైతు భరోసా పథకాల అమలు కోసం ఆయా గ్రామాల్లో సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేను శుక్రవారం జిల్లా, మండలస్థాయి అధికారులు పరిశీలించారు. చేర్యాల, దూళిమిట్ట, నంగునూరు మండలాల్లో పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ పరిశీలించారు. చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో, దూళిమిట్ట మండలంలోని జాలపల్లిలో అదనపు కలెక్టర్ సర్వే నిర్వహణ తీరుపై ఆరా తీసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాగా నంగునూరు మండలం సిద్దన్నపేటలోని ఓ వెంచర్‌ను జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవితో కలిసి అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వెంచర్‌కు సంబంధించిన వివరాలను, సర్వే తీరును ఆర్ఐ లింగం, పంచాయతీ కార్యదర్శి రవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి రైతు భరోసా పథకం ద్వారా లబ్ధి పొందేందుకు తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలతో పాటు మరో రెండు గ్రామాల్లో ఏడీఏ పద్మ ఆధ్వర్యంలో రెండోరోజు సర్వేను చేపట్టారు. గ్రామంలో పర్యటించి రేషన్ కార్డు లబ్ధిదారులను విషయాలు అడిగి తెలుసుకున్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని పీర్లపల్లిలో రెవెన్యూ, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న సాగుకు యోగ్యం కాని భూముల సర్వేను జడ్పీ సీఈవో రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూభారతి పోర్టల్‌లోని సాగుకు యోగ్యమైన భూములను మాత్రమే రైతు భరోసా ఇవ్వనున్నట్లు తెలిపారు. మిరుదొడ్డిలో సర్వేను మండల ప్రత్యేకాధికారి గణేష్‌రామ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కొండపాక మండలకేంద్రంతో పాటు మండలంలోని సిరసనగండ్ల, బంగారం, వెలికట్ట గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో భూముల వివరాలను సేకరించారు. అలాగే రేషన్ కార్డుల సర్వే నిర్వహించారు. ములుగు మండలంలో ఎనిమిది గ్రామాల్లో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ రెడ్డితో కలిసి ములుగు వ్యవసాయ అధికారి ప్రగతి సర్వేను పర్యవేక్షించారు. మండలంలోని క్షీరసాగర్, మామిడ్యాల, తానేదార్‌పల్లి, బైలంపూర్, సింగన్నగూడ, బస్వాపూర్, లక్ష్మక్కపల్లి, నర్సంపల్లి గ్రామాల్లో సాగు చేయని 152 భూములను గుర్తించామని తెలిపారు. అదేవిధంగా రాయపోల్ మండలకేంద్రంతో పాటు రాంసాగర్, బేగంపేట, చిన్నమాసాన్‌పల్లి తదితర గ్రామాల్లో జరుగుతున్న సర్వేను మండల ప్రత్యేకాధికారి, గజ్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు బాబూనాయక్, తహసీల్దార్ దివ్య పరిశీలించారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

బెజ్జంకి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చీలాపూర్, చీలాపూర్‌పల్లె, గుండారం గ్రామాల్లో సీసీ రోడ్ల పనులకు, బెజ్జంకి, పోతారం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రం భవనాలకు భూమిపూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. అనంతరం శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయపాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా జెల్ల ప్రభాకర్, సభ్యులుగా బర్ల రాజయ్య, బెజుగాం విశ్వప్రసాద్, గుబిరె చంద్రయ్య, దోనె శ్యామ్, అయిలేని జయ, బోనగిరి ప్రభాకర్ ప్రమాణ స్వీకారం చేశారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, పీడీ జయదేవ్ ఆర్య, డీపీఎం కరుణాకర్, ఆలయ ఈవో విశ్వనాథశర్మ, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమావేశం

హుస్నాబాద్ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో శుక్రవారం ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. దీనికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత హాజరై మాట్లాడారు. ఈ నెల 21వ తేదీ నుంచి 24 వరకు జరిగే వార్డు సభల్లో ఇందిరమ్మ కమిటీసభ్యులు ప్రజలందరిని భాగస్వామ్యం చేయాలని సూచించారు. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అర్హులైనవారికి అందేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు తదితరులున్నారు

ప్రతీ బ్యాంకు పరిసరాల్లో సీసీ కెమెరాలు ఉండాలి

- సిద్దిపేట ఏసీపీ మధు


బ్యాంక్ మేనేజర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట ఏసీపీ మధు

సిద్దిపేట క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతీ బ్యాంకు పరిసర ప్రాంతంలో సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేయాలని సిద్దిపేట ఏసీపీ మధు బ్యాంక్ మేనేజర్లకు సూచించారు. శుక్రవారం ఆయన ఏసీపీ కార్యాలయంలో సిద్దిపేట పట్టణ పరిసర ప్రాంతాల్లో ఉన్న బ్యాంక్ మేనేజర్లతో బ్యాంకుల అంతర్గత భద్రత, ఏటీఎంల భద్రత, సీసీ కెమెరాల పనితీరు గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఎలా పనిచేస్తున్నాయో ప్రతిరోజూ మానిటర్ చేయాలని సూచించారు. సెక్యూరిటీ గార్డ్ లేని బ్యాంకులలో సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బ్యాంకులో ఏ సంఘటన జరిగినా అల్లారం సిస్టం పని చేసే విధంగా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకులలో ఏదైనా సంఘటన జరిగితే కేసుల పరిశోధనలో బ్యాంకు అధికారులు సహకరించాలని సూచించారు. బ్యాంకులో ఉన్న కిటికీలు, డోర్స్, స్ట్రాంగ్‌రూమ్, 15 రోజులకు ఒకసారి వాటి పనితీరు గురించి తనిఖీ చేయాలని సూచించారు. బ్యాంకు మేనేజర్లు ఏదైనా సంఘటన జరిగితే త్వరగా సమాచారం ఇచ్చే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు. సైబర్‌నేరాల పట్ల బ్యాంక్ అధికారులతో పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, దుబ్బాక సీఐ శ్రీనివాస్, వివిధ బ్యాంకులకు సంబంధించిన మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

● హుస్నాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) హుస్నాబాద్ పట్టణంలోని పోలీసు సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం సర్కిల్ పరిధిలోని ఆయా బ్యాంకు మేనేజర్లతో ఏసీపీ సతీష్ సమావేశమయ్యారు. బ్యాంకుల్లో అంతర్గత భద్రత, ఏటీఎంలలో భద్రతపై చర్చించారు. సమావేశంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేశ్‌తో పాటు మేనేజర్లు ఉన్నారు.

మద్యానికి బానిసైన మహిళ ఆత్మహత్య

దుబ్బాక, జనవరి17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్వంతాపూర్ గ్రామంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. బల్వంతాపూర్ గ్రామానికి చెందిన సౌడు నాంపెల్లి భార్య రాజమణి(48) మద్యానికి బానిసైంది. మద్యం మానేయాలని చెప్పిన భర్త నాంపెల్లితో తరుచూ గొడవ పడుతుండేది. పలుసార్లు కుటుంబంలో గొడవలకు దారితీయడంతో రాజమణి నాలుగుసార్లు వివిధ రకాలుగా ఆత్మహత్యయత్నం చేసింది. అయితే కుటుంబసభ్యులు ఆమెను పలుమార్లు రక్షించారు. ఈ క్రమంలో మద్యం తాగిన భార్య రాజమణిని భర్త నాంపెల్లి మందలించాడు. దీంతో ఈ నెల 13న ఇంటిలో గడ్డి మందు తాగింది. ఆమెను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి 108 ద్వారా చికిత్స కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టుగా ఎస్ఐ తెలిపారు. మృతురాలికి భర్తతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి మృతికి కారణమైన ఇద్దరికి జరిమానా

వర్గల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మరణానికి కారణమైన ఇద్దరు వ్యక్తులకు శుక్రవారం గజ్వేల్ అడిషనల్ జేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ రూ. 12వేల జరిమానా విధించారు. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... 2019 జూలై 7రోజున మండలంలోని నాచారం ఆలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న మంగని నర్సయ్య పని ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో నాచారం గ్రామానికి చెందిన పచ్చకురా నవీన్ (19) అనే యువకుడు మోటర్ సైకిల్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ నర్సయ్యను ఢీ కొట్టడంతో అతడికి బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నర్సయ్య మృతి చెందాడు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు పోలీసులు మృతికి కారకుడైన నవీన్‌తో పాటు వాహనం యజమాని అయిన జనపకట్టి రాజుపై కేసు నమోదు చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపించారు. విచారణ అనంతరం నేరం రుజువైనందున గజ్వేల్ అడిషనల్ జేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ ప్రియాంక నిందితుడు నవీన్‌కు రూ. 11వేలు, వాహన యజమాని రాజుకు రూ. 1000 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

బెల్టు షాపు పై పోలీసుల దాడి


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం, బీరు బాటిళ్లు

చిన్నకోడూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచాపూర్‌లో ఓ బెల్టు షాపుపై పోలీసులు దాడి చేసి మద్యం, బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మాచాపూర్ గ్రామానికి చెందిన తెళ్ల లక్ష్మీనారాయణ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని పోలీసులకు సమాచారమందింది. దీంతో శుక్రవారం సిబ్బందితో కలిసి దాడి చేయగా రూ.13వేల విలువ గల (21లీటర్ల) మద్యం, బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

గజ్వేల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గజ్వేల్ పట్టణంలోని ఓ కాలనీలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులు పట్టుబడగా, ఇద్దరు పారిపోయారు. పట్టుబడిన వ్యక్తుల నుంచి రూ.15వేల నగదు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు గజ్వేల్ పోలీసులు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 11మందికి జరిమానా.. ఒకరికి జైలు

సిద్దిపేట క్రైం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో, రాజీవ్‌రహదారిపై ఇటీవల ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 11 మంది మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. నిందితులను శుక్రవారం సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ చేసి వారికి రూ.25,000 జరిమానా విధించారని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ వివరించారు. వారిలో ఒకరికి 3 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

సంగుపల్లిలో వ్యక్తి అదృశ్యం

గజ్వేల్‌రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అదృశ్యం అయిన సంఘటన గజ్వేల్ పట్టణంలోని సంగుపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంగుపల్లికి చెందిన బడే యాదగిరి(40) ఈ నెల 15వ తేదీ రాత్రి నుంచి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు చరవాణికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



దుబ్బాకలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గంగరాజు

చిన్నకోడూరు/దుబ్బాక/మిరుదొడ్డి/వర్గల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో ప్రజలు, వాహనదారులు, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. చిన్నకోడూరు మండలంలోని మల్లారం గ్రామంలో ఎస్ఐ బాలకృష్ణ వాహనదారులకు రోడ్డు భద్రత, నిబంధనలపై అవగాహన కల్పించారు. దుబ్బాక, మిరుదొడ్డి మండల కేంద్రాల్లో ఎస్ఐలు గంగరాజు, పరశురాములు ఆధ్వర్యంలో వేర్వేరుగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వర్గల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు రోడ్డు భద్రత, నిబంధనలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించారు.

పీఆర్టీయూ రాష్ట్ర సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ, పీఆర్టీయూ సంఘం ప్రతినిధులు

సిద్దిపేట క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ తెలంగాణ క్యాలెండర్‌ను సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి ఈ.శ్రీనివాసరెడ్డి శుక్రవారం స్థానిక డీఈఓ కార్యాలయంలో ఆవిష్కరించారు, గత ఏడాది ఎస్సెస్సీ స్పాట్ వ్యాల్యూయేషన్‌కు సంబంధించిన నిధులు విడుదల చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పన్యాల జనార్ధన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండి సమ్మయ్య ఈ సందర్భంగా కోరారు. అనంతరం జిల్లా ట్రెజరీ అధికారి చంద్రు నాయక్‌ను కలిసి క్యాలెండర్ సమర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, నాయకులు మధు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు భోగ నరేష్ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి, నంగునూరు మండలం అధ్యక్షుడు రాంగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.